జలవిహారం.. జ్ఞాపకమేనా..!

- ముందుకు కదలని 'టూరిజం' బోటు
- గోస్తనిలో స్మృతిగానే మిగిలిన బోటు షికారు
- సందర్శకుల ఎదురుచూపు



మత్స్యకారుల చిన్నబోటు ద్వారా షికారు చేస్తున్న సందర్శకులు (ఫైల్)



గతంలో అందుబాటులో ఉన్న కాశ్మీరిబోటు (ఫైల్)



గతంలో అందుబాటులో ఉన్న వాటర్ స్కూటర్ (ఫైల్)

భీమునిపట్నం: భీమిలిలో సాగర సంగమ ప్రాంతంలో బోటు షికారు మళ్లీ ఎప్పుడా అని సందర్శకులు ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ప్రారంభిస్తామన్న పర్యాటక శాఖ ప్రతిపాదనలు అధికారులకు జ్ఞాపకమున్నాయా లేదా.. సందర్శకులకు ఆ అనుభూతులన్నీ జ్ఞాపకాలుగానే మిగులుతాయా నిరీక్షిస్తున్నారు.

అనుకూలం..ఆహ్లాదకరం

భీమిలిలో గోస్తని నది సముద్రంలో కలిసే సాగరసంగమం ప్రాంతం భిన్నంగా ఉంటుంది. చాలా ప్రాంతాల్లో నదులు నేరుగా సముద్రంలో కలుస్తాయి, కానీ ఇక్కడ విశాలంగా ఉన్న ప్రదేశమంతా నీటితో నిండి ఉండగా.. నదిలో ఒకపాయ సముద్రంలో కలుస్తుంది. దీంతో విశాలంగా ఉన్న నదీప్రాంతం బోటు షికారుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. చుట్టూ కొండల నడుమ ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా మధురానుభూతిని పంచుతుంది.

2006లోనే ప్రారంభించినా..

ఇక్కడ ప్రకృతి అందాలను, బోటింగ్‌కు అనుకూలతను దృష్టిలో ఉంచుకుని 2006లో అప్పటి మున్సిపల్ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా గౌతమ్ బోట్‌హౌస్ పేరుతో బోటు షికారును ఏర్పాటు చేశారు. ఇందులో స్పీడ్ బోట్, ఫ్యామిలీబోట్, కాశ్మీరిబోట్, వాటర్ స్కూటర్, కపుల్స్ బోట్ మొదలైన పలురకాలైన బోట్లు ఏర్పాటు చేశారు. ఎక్కడా లేని విధంగా, ఇక్కడ పలు రకాల బోటింగ్ సదుపాయం ఉండడం ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. దీంతో ప్రతిరోజు అనేక ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అధిక సంఖ్యలో బోట్ షికారు కోసం వచ్చేవారు. రెండేళ్ల వరకు బాగానే ఉన్నా, తర్వాత ఏవో కారణాలతో మూతపడిపోయింది.

ఆ తరువాత మళ్లీ ఇక్కడ బోటు షికారు ఏర్పాటు జరగలేదు. కొంతకాలం మత్స్యకారులు ఏర్పాటు చేసిన చిన్న బోటు ద్వారా బోటు షికారు నిర్వహించినా, అదీ కొద్ది కాలానికే ఆగిపోయింది. పర్యాటకులకు అందమైన అనుభూతిని ఇచ్చే బోటు షికారు లేకపోవడంతో ఇక్కడికి వచ్చేవారు నిరాశగా వెనుతిరుగుతున్నారు.

ప్రకటనలకే పరిమితమైన పర్యాటకశాఖ

ఇక్కడ బోటు షికారు ఏర్పాటు చేస్తామని పర్యాటక శాఖ ఎన్నో సంవత్సరాలుగా ప్రకటనలు చేస్తోంది. 2016లో ఆశాఖ అధికారులు ఇక్కడ బోట్‌షికారు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా బోటు షికారు చేసేవారికి టిక్కెట్లు ఇవ్వడానికి, సిబ్బంది ఉండడానికి ఒక కంటైనర్‌ను కూడా తీసుకు వచ్చారు. దీంతో బోటుషికారు త్వరలో ప్రారంభమవుతుందని సందర్శకులు ఎంతో ఆనందపడ్డారు. కాని ఏం జరిగిందో తెలియదు కానీ, బోటు షికారు మాత్రం ఏర్పాటు కాలేదు.



బోట్ షికారుకు అనుకూలమైన గోస్తని నదీ ప్రాంతం

అలాగే, అక్కడికి తెచ్చిన కంటైనర్‌ను కూడా తిరిగి తీసుకు వెళ్లిపోయారు. దీంతో అప్పటివరకు అందరిలో ఉన్న ఆనందం ఆవిరైపోయింది. తరువాత మళ్లీ బోటుషికారు ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నా.. అది కార్యరూపం దాల్చడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు బోటుషికారు లేకపోవడం వెలితిగా ఉంటోంది. మరి కొద్దిరోజుల్లో కార్తీక మాసం వస్తుండడంతో పిక్‌నిక్‌ల సీజన్ మొదలవుతుంది. అప్పుడు పెద్ద ఎత్తున సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. ఇటువంటి సమయంలోనైనా దీనిపై పర్యాటకశాఖ దృష్టి పెట్టి బోట్‌షికారు ఏర్పాటు చేయాలని సందర్శకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రత్యేకించి బోటు షికారు కోసమే వచ్చేవారు



ఆహ్లాదకర వాతావరణంలో బోటు షికారు చాలా బాగా ఉండేది. ప్రత్యేకించి దానికోసమే చాలా మంది సందర్శకులు వచ్చేవారు. పిల్లలకు ఎంతో ఆనందంగా ఉండేది. ఇప్పుడు బోట్ షికారు లేకపోవడం వెలితిగా ఉంటోంది. అధికారులు స్పందించి, ఆ సదుపాయం కల్పిస్తే ఇక్కడ ఆదాయము బాగుంటుంది, సందర్శకులకు సంతృప్తికరంగా ఉంటుంది.

– ఎస్.రమేష్, భీమిలి

కుటుంబంతో వచ్చేవాళ్లం



ఇక్కడ బోటు షికారు ఉండే సమయంలో కుటుంబంతో వచ్చి మేమందరం ఎంతో ఆనందంగా వాటిల్లో తిరిగేవారం. కాని ఇప్పుడు మూతపడిపోవడంతో ఆ అవకాశం లేకుండా పోయింది. ఇక్కడికి వచ్చిన ప్రతీసారి ఆ జ్ఞాపకాలు గుర్తొస్తాయి. మళ్లీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అందరం బాగా ఎంజాయ్ చేస్తాం

– పి.వి.రాఘవేంద్రరావు, హైదరాబాద్

చాలా సరదాగా ఉండేది



మేము వైజాగ్ వచ్చినప్పుడు బీచ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో గడిపినా.. బోటు షికారు కోసం ప్రత్యేకంగా భీమిలి వచ్చేవాళ్లం. ఇక్కడి వాతావరణంలో బోటు షికారు వల్ల కలిగే అనుభూతి చాలా బాగుండేది. పిల్లల కేరింతలతో సరదాగా ఉండేది. చాలా మంది పిల్లలు కూడా ప్రత్యేకించి దీని కోసమే వచ్చేవారు. ఇప్పుడు బోటు షికారు లేకపోవడం వెలితిగా ఉంది. ఈసారైనా అధికారులు బోటు షికారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

– అయ్యగారి లలిత, కోర్బా, ఛత్తీస్‌గఢ్

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి



మాజీ సీఎం జగన్‌తో మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా మృతుల కుటుంబాలను పరామర్శించడానికి వచ్చిన ఆయన్ను విశాఖ ఎయిర్‌పోర్టులో కలిశారు. ఈ సందర్భంగా భీమిలిలో జరుగుతున్న పరిణామాలను వివరించారు.

కృష్ణాపురంలో క్వారీ పరిశీలన



కృష్ణాపురంలో క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్ కుమార్

పద్మనాభం: అనధికారికంగా స్టోన్ క్వారీలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని కృష్ణాపురంలో స్టోన్ క్వారీలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహించకూడదన్నారు. ఆయన వెంట వీఆర్వో రవి ఉన్నారు.

మందుబాబులకు రూ.90వేలు జరిమానా

మధురవాడ: పీఎం పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపి, పోలీసులకు పట్టుబడిన 9 మందికి కోర్టు జరిమానా విధించింది. నిందితులను సెకండ్ స్పెషల్ ఎక్సైజ్ జ్యుడీషియరీ మేజిస్ట్రేట్ ఎదుట గురువారం ప్రవేశపెట్టారు. వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.90వేలు అపరాధ రుసుం విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సెక్షన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ కె.చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎండాడ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, గొల్లల ఎండాడ, సందీపినీనగర్, రాజీవ్‌నగర్, శ్రీనివాస్‌నగర్, దుర్గానగర్, వరాహగిరినగర్, ముబారక్ కాలనీ, శాంతినగర్, గణేష్‌నగర్, రామాలయం వీధి, చలపతినగర్, రెవెన్యూకాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించాలని కోరారు.

చంద్రంపాలెం ఫీడర్ పరిధిలో..

మధురవాడ: మధురవాడ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ చంద్రంపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శైలజ తెలిపారు. ఈ కారణంగా చంద్రంపాలెం, మధురవాడ మెయిన్‌రోడ్, దుర్గానగర్-1, దుర్గానగర్-2, కృష్ణానగర్, పోర్టు కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

యానాద్రి చెరువు వద్ద వ్యర్థాల తొలగింపు



చెరువు వద్ద వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని రేవిడిలో యానాద్రి చెరువు వద్ద వ్యర్థాలను గురువారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ చెరువులోని వ్యర్థాలను తొలగించాలని రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు ఇటీవల ఈవోఆర్డీ మీనాకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఈవోఆర్డీ మీనాకుమారి, ఎంపీటీసీ సూరప్పడు ఆధ్వర్యంలో వ్యర్థాలను తొలగించారు.

స్వాధీన స్థలంలో ప్రహరీ నిర్మాణం



పోలీసుల బందోబస్తుతో నిర్మించిన తాత్కాలిక ప్రహరీ

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ సర్వే నంబర్ 276 జట్లమ్మ కొండపై బుధవారం ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు గురువారం తాత్కాలిక ప్రహరీగోడ నిర్మించారు. ఈ సందర్భంగా ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

కొండపేట కొండపై కొండచిలువ కలకలం



స్థానికుల చేతిలో హతమైన కొండచిలువ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట కొండపై పంప్‌హౌస్ వైపు గురువారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. స్థానికులు గమనించి దానిని హతమార్చారు. ఈ ప్రాంతంలో కొండపై నుంచి తరచూ విషపురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపై పార్కు, కొండ చుట్టూ నివాసాలలో వీధి లైట్లు వేయాలని కోరుతున్నారు.

వీవోఏను వేధించి.. విధుల నుంచి తొలగించి..

- అమనాంలో టీడీపీ నాయకుల దౌర్జన్యకాండ

తగరపువలస : భీమిలి మండలం అమనాం పంచాయతీలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీవోఏ) చుక్క గౌరిని స్థానిక టీడీపీ నాయకులు వేధించి, విధుల నుంచి తొలగించిన సంఘటన చోటుచేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాల తరఫున పనిచేసిన ఈమెపై కక్ష సాధించి వేటు వేయించారు. ఆమె స్థానంలో టీడీపీకి చెందిన విజయలక్ష్మి అనే మహిళను నియమించారు. వాస్తవానికి 2016లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే చుక్క గౌరి వీవోఏగా నియమితులయ్యారు. ఇప్పుడు గౌరిని వేధించి, విధుల నుంచి తప్పించిన నాయకులు అప్పట్లో వేరే పార్టీలో ఉన్నారు. గౌరి ఈ ఎనిమిదేళ్లలో 5 సార్లు ఉత్తమ వీవోఏగా గుర్తింపు పొంది, అప్పటి టీడీపీ హయాంలోనే ఉత్తమ వీవోఏగా అమరావతి కూడా వెళ్లారు. తనకు కేటాయించిన 35 డ్వాక్రా సంఘాలను సక్రమంగా నడిపించడం, రుణాలు చెల్లించడం వంటి వాటిలో గౌరి ముందుండి జిల్లాలోనే గుర్తింపు పొందారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంచాయతీకి చెందిన ఆరుగురు టీడీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షుడి నుంచి ఈమె పలుమార్లు వేధింపులకు గురయ్యారు.

డ్వాక్రా మహిళలు ఓటింగ్‌లో పాల్గొనకుండా..

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఆరోపిస్తూ పంచాయతీలోని ఇద్దరు వీవోఏలపై ఎన్నికల తరువాత ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎంపీడీవో తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. టీడీపీ నాయకుల ఫిర్యాదులో నిజం లేదని గ్రహించిన ఆర్డీవో, ఎంపీడీవో సస్పెన్షన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ టీడీపీ నాయకులు పట్టు వదల్లేదు. 35 డ్వాక్రా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో ఓటింగ్ నిర్వహించి వారు ఎన్నుకుంటే వీవోఏగా కొనసాగిస్తామన్నారు. మరోవైపు ఓటింగ్‌లో పాల్గొంటే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని డ్వాక్రా మహిళలను బెదిరించారు. కేవలం వారికి అనుకూలంగా ఉన్న 14 మందితో ఓటింగ్ నిర్వహించి, విజయలక్ష్మిని వీవోఏగా నియమించుకున్నారు. భీమిలి మండల వెలుగు అధికారులు కూటమి నాయకులు బెదిరింపులకు తలొగ్గారు. పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు తనను చులకన చేసి మాట్లాడారని గౌరి గురువారం విలేకరుల వద్ద వాపోయారు. మహిళ అన్న గౌరవం లేకుండా పలుమార్లు కించపరిచారన్నారు. తనకు జరిగిన అవమానం మరే మహిళకు జరగకూడదని కన్నీరు పెట్టుకున్నారు.

కన్వెన్షన్ సెంటర్ వేగంగా సిద్ధం చేయాలి



కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

కొమ్మాది: కన్వెన్షన్ సెంటర్ భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం ఎండాడ వద్ద నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతిని ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సంస్థకు అదనపు ఆర్థిక వనరును సృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గుత్తేదారు కాలపరిమితుల ప్రకారం సకాలంలో సంబంధిత పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కన్వెన్షన్ సెంటర్ అప్రోచ్ రహదారి డిజైన్‌ను పరిశీలించి తగిన మార్పులు, చేర్పులు సూచించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కార్తీక, సహాయక ఇంజినీర్ శర్మ, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం సరే.. నిత్యావసర సరకుల సంగతేంటి?



అధిక ధరలకు వ్యతిరేకంగా నగరంపాలెంలో ప్రచారం చేస్తున్న పైడిరాజు తదితరులు

మధురవాడ: మద్యం నాణ్యత పెంచి, ధరలు తగ్గించి సరఫరా చేస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు ఎందుకు తగ్గించలేకపోతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ప్రశ్నించారు. జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెం, పోర్టుకాలనీ తదితర ప్రాంతాలలో అధిక ధరలకు వ్యతిరేకంగా గురువారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి సనాతన ధర్మం, తిరుపతి లడ్డూ అంశాలు తీసుకురావడం న్యాయం కాదన్నారు. ఇటువంటి ట్రిక్కులు చేయడం తగదని హితవు పలికారు. అధిక ధరల వలన పేదలు, మధ్య తరగతి ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎండీ బేగం సత్యనారాయణ, డి.సతీష్, కె.చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం పంచాయతీ గుమ్మిడివానిపాలెం జాతీయరహదారిని ఆనుకుని సర్వే నంబర్ 66లో 1 ఎకరం 76 సెంట్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మధురవాడ: కాపులుప్పాడలోని జీవీఎంసీ డంపింగ్‌యార్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బూస రమణారెడ్డి(41) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనకు సంబంధించి పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. టాటా మోటార్స్ ఫైనాన్స్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రమణారెడ్డి మద్దిలపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆనందపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా 3.30 గంటల సమయంలో బోరవానిపాలెంలోని డంపింగ్‌యార్డు సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై పంది అడ్డంగా వచ్చింది. దీంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో రోడ్డుపై పడిపోయిన ఆయన తలకు గాయమైంది. వైద్యం నిమిత్తం స్థానిక గాయత్రి ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు. భార్య నూకరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చీటీల పేరుతో మోసగించిన దంపతులకు రిమాండ్



నిందితులు రోజా, శ్రీనివాసరావు

తగరపువలస: చీటీలు, స్కీమ్‌ల పేరుతో పలువురిని మోసగించిన కేసులో జీవీఎంసీ రెండోవార్డు సత్యనారాయణపేటకు చెందిన వంగపండు రోజా, శ్రీనివాసరావులను భీమిలి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన కొసన సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిని అరెస్ట్ చేశారు. ఈమెకు నిందితుల నుంచి రూ.1.19 కోట్లు రావలసి ఉంది. 2008 నుంచి 2021 వరకు చిల్లపేటకు సమీపంలో స్కూల్ నిర్వహించిన వీరు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రుల నుంచి చీటీలు, స్కీమ్‌లకు డబ్బులు వసూలు చేసి, తిరిగి ఇవ్వలేదు. దీంతో మరో 20 మంది బాధితులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు ఆధారంగా సీఐ బి.సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు. వీరందరి నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఏడాకుల చెట్ల తొలగింపునకు వినతి

తగరపువలస: జీవీఎంసీ పరిధిలో రహదారులకు ఇరువైపులా ఉన్న ఏడాకుల చెట్ల వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, వాటిని తొలగించాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వినతిపత్రం అందించారు. అప్పన్న మాట్లాడుతూ డెవిల్ ట్రీగా పిలవబడే ఈ చెట్ల పువ్వుల నుంచి వెలువడుతున్న విష వాయువుల వలన ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా వీటిని తొలగించాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న వంగపండు ఉష, మారుతీప్రసాద్ తదితరులు

మధురవాడ: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని వక్తలు పేర్కొన్నారు. జీవీఎంసీ 7వ వార్డు గణేష్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీ ప్రసాద్ జన్మదినం సందర్భంగా, ఆయన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, పేదలకు వస్త్రదానం చేశారు. ఛత్రపతి శివాజీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. 60మంది క్రీడాకారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇతర ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాపోషకులు కందుల మల్లేశ్వరరావు, కురిటి సత్యంనాయుడు, క్రిస్టియన్ అండ్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర క్రియేటివిటీ, కల్చర్ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వంగపండు ఉష, ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వంకాయల సాయికుమార్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, బంగారు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆక్రమణలు



అర్ధరాత్రి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డులో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మంగమారిపేట దరి రామాద్రి సమీపంలో సర్వే నంబరు 314లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఓ వ్యక్తి అర్ధరాత్రి జేసీబీలను పెట్టి చదును చేయించాడు. ఈ కొండపై ఇప్పటికే అనేక ఆక్రమణలు జరిగినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే రాత్రి సమయాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కొండపై బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు జేసీబీతో ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి ఆక్రమించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనిపై స్థానిక నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడంలో భీమిలి రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంగమారిపేట, నర్సింహానగర్, కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెం కొండలపై యథేచ్ఛగా స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోకపోవడం వెనుక గల కారణాలు తెలియాల్సి ఉంది.

పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

పద్మనాభం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని భీమునిపట్నం ఆర్డీవో సంగీత్ మాథూర్ అధికారులకు సూచించారు. పద్మనాభం తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వీఆర్వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వేలో తప్పులను సవరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

పాండ్రంగి కాజ్‌వే పరిశీలన

పాండ్రంగి సమీపాన గోస్తని నదిలో కాజ్‌వేను ఆర్డీవో పరిశీలించారు. వర్షాల సమయంలో నదిలో కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోందని, ఆ సమయంలో దీనిపై వెళ్లడం ప్రమాదకరమని తహసీల్దార్ ఆనంద్ కుమార్ ఆర్డీవోకు వివరించారు.

విశ్వశాంతి పరిరక్షణలో యూఎన్‌వో కీలకం



ప్రసంగిస్తున్న ఏయూ ప్రొఫెసర్ అర్జున

కొమ్మాది: ప్రపంచ దేశాల్లో శాంతిని పరిరక్షించేందుకు ఐక్యరాజ్యసమితి ఎంతో కృషి చేస్తోందని ఏయూ ప్రొఫెసర్ అర్జున అన్నారు. ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎండాడలోని ఎయిమ్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ శాంతి, యుద్ధాల నివారణ, పేదరిక నిర్మూలన వంటి ఆలోచనలతో యూఎన్‌వో ఏర్పడిందన్నారు. నేడు రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయెల్ తదితర దేశాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని, లక్షల్లో ప్రాణ నష్టం, ఎంతో ఆస్తి నష్టం జరుగుతోందన్నారు. ఐక్యరాజ్య సమితి కలగజేసుకుని తగు చర్యలు తీసుకుని, పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జేవీ ప్రభాకర్, ఎయిమ్స్ కళాశాల చైర్మన్ జంగాలయ్య, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

తగరపువలస: ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ, తెలుగు భాషలలో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు గురువారం బహుమతులు అందించారు.

- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం, ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు.